# బాలాకి

**బాలాకి** అనే యువకుడు గార్గవంశంలో జన్మించినవాడు. అతనిని దర్పం ఆవహించినది. తనకు అన్నీ తెలుసునని అహంభావం బలిసినది. బాగా డబ్బు సంపాదించాలని కోరిక కలిగినది. అతడు అజాతశత్రువు అనే రాజవద్దకు వెళ్ళాడు.

బాలాకి అజాతశత్రువుకు బ్రహ్మతత్త్వాన్ని గురించి ఉపదేశం చేస్తానని అన్నాడు. 'ఉపదేశం చేస్తాను' అని మాట ఇచ్చినందుకే రాజు బాలాకికి వేయి ఆవులను పారితోషికంగా ఇచ్చాడు. ఆ ఆవులు బహుమానంగా ఇస్తూ ఇలా చెప్పాడు : "బ్రాహ్మణకుమారా! ఏదో నాశక్తి కొలదీ ఇస్తున్నాను. నేను జనక మహారాజు అంత సంపన్నుడిని కాదు, అతనివలె విరివిగా దాన ధర్మాలు చెయ్యటానికి. ఈ రోజులలో అందరు 'జనకుడో,జనకుడో' అంటూ అటు పోతున్నారు" అని. బాలాకికి ఆ గోధనాన్ని చూచేటప్పటికి కళ్ళు తిరిగిపోయినాయి.

బాలాకి రాజుగారికి ఉపదేశం ఆరంభించాడు.

డి. శ్రీధరబాబు

"రాజా! పరమ సత్యమయిన ఆ బ్రహ్మం గురించి వివరిస్తాను విను" — అని అనేటప్పటికే అజాతశత్రువు అతని హృదయపు లోతు ఇట్టే గ్రహించాడు.

బాలాకి సూర్యునిలో ఉన్న ఆత్మే బ్రహ్మమని చెప్పాడు. ఈ విషయాన్ని అజాతశత్రువు అంగీకరించలేదు. "సూర్యుడు అన్ని జీవరాసులకు ఆధిపత్యం వహింపవచ్చునేమోకాని పరబ్రహ్మమగు పరమసత్యమే అతడు కానేరడు" అని బాలాకి వాదాన్ని అజాతశత్రువు తిరస్కరించాడు.



వెనుకటిలాగానే బాలాకి మళ్ళీ చెప్ప నారంభించాడు. చంద్రునిలో ఉన్న ఆత్మే పరమాత్మ అయిన పరబ్రహ్మం అని అంటే అజాతశత్రువు అది అలా కావటానికి వీలులేదని తిరస్కరించాడు.

ఈవిధంగా బాలాకి విద్యుల్లతలలో వెలుగుతున్నది, ఆకాశంలో ఆవరించి ఉన్నది వాయువులో ఇమిడి ఉన్నది పరబ్రహ్మమని విడివిడిగా ప్రతిపాదించాడు. ప్రతిసారీ అజాతశత్రువు అతని నిర్వచనంలోని లోపాన్ని వివరిస్తూ తిరస్కరించాడు. భాగాలు భాగాలుగా చెప్పి అదే బ్రహ్మమని చెప్పటం అజాతశత్రువునకు నచ్చలేదు.

బాలాకి పని అయిపోయినది. దీనంగా ఇలా చెప్పాడు: "నాకు తెలిసినది ఇంతే. అదే చెప్పగలిగాను. ప్రస్తుతం తమకేమైనా తెలిసిఉంటే నాకు ఆ సత్య విజ్ఞానాన్ని గురించి తమరే ప్రబోధం చెయ్యండి. తమ వద్దనుంచే ఆ సత్యాన్ని గ్రహింపగోరుతున్నాను."

వర్ణానికి రాజు క్షత్రియుడు. బాలాకి బ్రాహ్మణుడు. అందుకని అజాతశత్రువు ఇలా చెప్పాడు: "బ్రాహ్మణకుమారా! ఇలా బ్రాహ్మణుడు ఆత్మ విజ్ఞానానికి క్షత్రియుని ఆశ్రయించడం సంప్రదాయం కాదు. అయినా పరవాలేదు. అసలు విషయాన్ని తెలుసుకొనడానికి అది అడ్డురాదు. నాకు తెలిసినది ఏదో నీకూ చెబుతాను."

ఇలా అని అజాతశత్రువు బాలాకిని చెయ్యి పుచ్చుకొని గాఢంగా నిద్రలో మునిగి ఉన్న ఒక

# బాలాకి

వ్యక్తివద్దకు తీసుకొని వెళ్ళాడు. ఆ నిద్రపోతూ ఉన్నవాడి పేరు సోమరాజు. అజాతశత్రువు నిద్రిస్తున్నవాడి పేరు పెట్టి పిలుస్తూ "ఓ సోమరాజా! లే నిద్రమేలుకో" అని అన్నాడు. కాని సమాధానం లేదు. తర్వాత నిద్రిస్తూన్న సోమరాజును రాజు చేతితో తట్టి లేపాడు. అప్పుడు అతడు నిద్రనుండి మేల్కొంచాడు.

రాజు బాలాకిని అప్పుడు ప్రశ్నించాడు: "బాలాకీ! నిద్రిస్తూన్న సమయంలో ఈ నిద్రించిన సోమరాజు ఎక్కడికి వెళ్ళాడో నీకు తెలుసా?" బాలాకికి ఈ విషయాలు ఏమీ తెలియవు. సమాధానం ఇవ్వడానికి అతనివద్ద ఏమీలేదు.

రాజు అతనితో చెప్పాడు : "కుమారా! సోమరాజులో ఉన్న విజ్ఞానతత్త్వం తాత్కాలికంగా నిద్రించటంకాని, మేల్కొనడంకాని చేస్తున్నది. నిద్రలోకూడా అతడి శరీరం సజీవంగానే ఉన్నది. అతని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిరంతరం సాగుతూనే ఉన్నాయి. అతని విజ్ఞానం జ్ఞానేంద్రియాల శక్తిని వెనుకకు తరలించుకొనిపోయి హృదయాకాశంలో నిద్రా సమయాన సంపూర్ణమైన విశ్రాంతి పొందుతుంది. ఆ సమయంలో శరీరంలోని వివిధ శక్తులు తమ తమ పనులనుంచి విరమిస్తాయి. నిద్రలో విశ్రాంతి తీసుకొంటాయి. స్వప్నసీమలో విజ్ఞానం వివిధ రూపాలు దాలుస్తుంది. స్వప్నంలో ఒకడు ఒకసారి విశాలభవనాలలో విహరించే మహారాజు కావచ్చును. మరి ఒకసారి నిష్ఠాపరుడైన బ్రాహ్మణుడుగా, ఇంకొకసారి అరణ్యాలలో సంచరించే నిషాదుడుగా రూపాలు దాల్చవచ్చును.

"మనుష్యుడు గాఢ సుషుప్తిలో ఉన్నప్పుడు బాహ్యవస్తువులను అనుభవించలేడు. స్వప్నానుభవం అతనికి రాదు. అతడు పూర్ణమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. అతడు మేల్కొంచిన పిమ్మట విజ్ఞానం తిరిగి బాహ్యప్రపంచంలో తన కార్యకలాపాలు యథాప్రకారంగా సాగిస్తుంది.

"ఈ విజ్ఞాన తత్త్వమే బ్రహ్మం. మనుష్యుడు మెలకువగా ఉన్నా, నిద్రపోతూ ఉన్నా, కలలు కంటున్నా స్థిరంగా ఉండేది ఆ తత్త్వం. సాలీడునుంచి లెక్కింపటానికి వీలులేనన్ని పోగుల గూడు ఏర్పడినట్లు, మండే జ్వాలనుండి లేగే నిప్పు రవ్వలవలె ఈ విశ్వంలోని విభిన్న వస్తుజాలం, ప్రాణశక్తి, లోకాలు, దేవతలు అన్నీ ఆ పరతత్త్వమయిన పరబ్రహ్మ తత్త్వంనుంచే జనించాయి."

బాలాకి అలా వినయపూర్వకంగా అజాతశత్రువు అందించిన బ్రహ్మతత్త్వ వర్ణన విన్నాడు. అతని దర్పం తొలగిపోయినది. గర్వం అణగిపోయినది. అజ్ఞానం పటాపంచలై పోయినది.

(బృహదారణ్యకోపనిషత్తునుంచి)


నేతలో, మన్నికలో పనితనంలో

# కొఠారీ మల్లులు

విశిష్టమైనవి లాంగ్‌క్లాత్‌లు కూడా!

... ఎందుకంటే

- కొఠారీ మల్లులు మరియు లాంగ్‌క్లాత్ బట్టల తయారీలో ఉపయోగింపబడిన నూలు ఉత్తమ రకపు కొఠారీ నూలు.
- వాటింతటవే తిరిగే ఆటోమాటిక్ లూములమీద నేసిన బట్ట నేత బాగా ఉంటుంది.

ఎప్పుడూ కొఠారీ మల్లు M-7 మరియు అదే పేరుతో లాంగ్‌క్లాత్ L-1 లేక L-2 అడగండి.

ఈ ట్రేడ్ మార్కుని గమనించండి




KS
KOTHARI & SONS

తయారుచేసినవారు :
కొఠారీ టెక్స్టైల్స్ లిమిటెడ్
సింగనల్లూరు, కోయంబత్తూరు.
భారతీయ మావక్ సంస్థ సభ్యులు స్పిన్నింగ్ మెంబర్లు.
మేనేజింగ్ ఏజెంట్లు :
కొఠారీ & సన్స్, ఓరియంటల్ బిల్డింగ్స్, అర్మీనియన్ స్ట్రీటు, మద్రాసు-1.

KTZ-1754 TG